తాగునీటి సమస్యకు చెక్

- మున్నేరు, లకారం చేరిన సాగర్ జలాలు
- మున్నేరు దానవాయిగూడెం చెక్‌డ్యామ్ వద్ద 0.05 టీఎంసీలు
- లకారానికి నీరు చేరడంతో పెరగనున్న భూగర్భజలాలు
- నగరంలో తాగునీటి అవసరాలకు 50 ఎంఎల్‌డీల సరఫరా



మున్నేరు దానవాయిగూడెం చెక్‌డ్యామ్ వద్ద నీరు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాభావం, సాగర్‌లో నీటి నిల్వలు తగ్గడం, మార్చిలోనే ఎండల తీవ్రత పెరగడంతో ఖమ్మం నగరంలో నీటి ఎద్దడి ఏర్పడింది. పాలేరులో నీరు లేకపోవడం, మున్నేరు ఎండిపోవడం, లకారంలో నీటి మట్టం పడిపోవడం వెరసి మార్చి మొదటి వారంలోనే తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి ఎదురైంది. ఉన్న నీటిని వినియోగించుకుంటూ, పాలేరు నుంచి కొంత తరలించి నెల పాటు నగర వాసులకు తాగునీటిని సరఫరా చేశారు. ఇంతలోనే అడుగంటిన పాలేరు రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపి, ఆ నీటిని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలేరుకు సాగర్ జలాలు రావడం, నీటిమట్టం 18 అడుగులకుపైగా చేరడంతో ఖమ్మం అవసరాలకు వదిలారు. మున్నేరు దానవాయిగూడెం చెక్‌డ్యామ్‌ను నింపడంతో పాటు, లకారం చెరువుకు నీటిని విడుదల చేయగా ప్రజల దాహార్తి తీరనుంది.

మున్నేరుకు చేరిన 0.05 టీఎంసీల నీరు

ఖమ్మం వాసులకు జీళ్లచెరువు మిషన్ భగీరథ గ్రిడ్‌తో పాటు మున్నేరు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్, లకారం చెరువు ఫిల్టర్ బెడ్ నుంచి నీరు సరఫరా చేస్తారు. మున్నేరు, లకారం చెరువు నుంచి నీటిని వినియోగించుకునేందుకు పాలేరు నుంచి అధికారులు నీటిని విడుదల చేయించారు. పాలేరు నుంచి సాగర్ కాల్వ ద్వారా మున్నేరు దానవాయిగూడెం చెక్‌డ్యామ్‌కు 0.05 టీఎంసీల నీటిని విడుదల చేశారు. దీంతో పాటు పైపుల ద్వారా లకారం చెరువుకు నేరుగా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మున్నేరుకు చేరిన నీరు నెల పాటు తాగునీటి అవసరాలకు సరిపోతుందని, గ్రిడ్‌తో పాటు మున్నేరు, లకారం చెరువు నుంచి తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

పెరగనున్న భూగర్భజలాలు

మున్నేరు దానవాయిగూడెం చెక్‌డ్యామ్‌తో పాటు లకారం చెరువును సాగర్ జలాలతో నింపడం ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మున్నేరు ఎండి పోవడం, లకారంలో నీటి మట్టం పడిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో మార్చి మొదట్లోనే భూగర్భ జలాలు పడిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకొని వినియోగించుకున్నారు. లకారం చెరువు నిండితే నగరంలో భూగర్భజలాలు పెరిగి సమస్య తీరుతుందని చెబుతున్నారు.

50 ఎంఎల్‌డీ నీరు సరఫరా

పాలేరులో 18 అడుగులకు పైగా నీటి నిల్వలు ఉండడం, మున్నేరుకు, లకారానికి నీరు చేరడంతో ప్రజా అవసరాలకు అనుగుణంగా సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. గ్రిడ్ నుంచి కార్పొరేషన్‌కు రోజుకు 35 ఎంఎల్‌డీ నుంచి 40 ఎంఎల్‌డీ వరకు తాగునీటిని సరఫరా చేస్తారని, మరో 10 ఎంఎల్‌డీ మున్నేరు, లకారం నుంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. రోజుకు ఖమ్మం కార్పొరేషన్‌లో 50 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేయనుండగా, ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే రోజు విడిచి రోజు సరఫరా చేయనున్నారు.

జూన్ వరకు సరఫరా



మున్నేరుకు చేరిన నీటిని నెల రోజుల పాటు తాగునీటి అవసరాలకు వినియోగించవచ్చు. నెల రోజుల తర్వాత పాలేరు నుంచి మరో 0.05 టీఎంసీ నీటిని కార్పొరేషన్ తాగునీటి అవసరాలకు తీసుకోవచ్చు. ప్రస్తుతం పాలేరులో, మున్నేరు, లకారంలో ఉన్న నీటిని జూన్ నెల వరకు నగర ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు చేశాం. గ్రిడ్ నుంచి నీటిని తీసుకుంటూనే, మున్నేరు, లకారం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తాం.

–ఇ.రంజిత్, ఎస్‌ఈ, కేఎంసీ, ఈఈ, పబ్లిక్ హెల్త్

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్‌లోని స్వయంభూ శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేయడమే కాక చలువ పందిళ్లు వేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల బొల్లి కొమరయ్య, పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్, ప్రధాన అర్చకులు నరగిరినాథుని రామాచార్యులు తెలిపారు. తొలిరోజు మంగళవారం అంకురార్పణ, , ధ్వజారోహణ పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా 4వ డివిజన్ బాలాజీనగర్‌లోని శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. అలాగే, 7వ డివిజన్ ఖానాపురం కృష్ణుని గుడిలో పూజలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, మలీదు జగన్, దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన చంద్రయ్యయాదవ్, లక్ష్మీనారాయణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి జాతర షురూ



ప్రత్యేక అలంకరణలో శ్రీకోటమైసమ్మ తల్లి

కామేపల్లి: కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తులు భావించే శ్రీకోటమైసమ్మతల్లి జాతర మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పండగను పురస్కరించుకుని కొత్తలింగాల శ్రీకోటమైసమ్మ ఆలయంలో ఏటా మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు పుల్లయ్యశర్మ, మణిశర్మ ఆధ్వర్యాన అమ్మవారికి అలంకరించి పూజ చేశారు. కాగా, మంగళవారం భారీగా భక్తులు వచ్చే అవకాశమున్నందున ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

శ్రీ కోటమైసమ్మతల్లి జాతర మహోత్సవాల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ పునర్నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేసి అమ్మవారిని దేవాలయంలో ప్రతిష్ఠించుకుందామని తెలిపారు. ఈకార్యక్రమంలో గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, మేకల మల్లిబాబుయాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు, ధరావత్ అనురాధ, కోడెం సులోచన, ఏపూరి మహేందర్, ఆరెం రవి, దమ్మాలపాటి సత్యనారాయణ, దేవండ్ల రామకృష్ణ, ముక్తి సాంబశివరావు, గుగులోత్ గబ్రూనాయక్, రెడబోతు గోపీరెడ్డి, చల్ల మల్లయ్య, గట్టికొప్పుల నారాయణరెడ్డి, దొడ్డ వేణు, తోటకూరి శ్రీను, మాలోత్ సరిరాం, జర్పుల లక్ష్మణ్, మాలోత్ రాంచందర్‌నాయక్, ఇమ్మడి రామనాథం పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం..



మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు, పక్కన మధు

రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామ ని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. మండలంలోని చిమ్మపూడిలో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ గుత్తా రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరూనాయక్, నాయకులు తాళ్లూరి జీవన్, కుర్రా భాస్కర్‌రావు, మద్దినేని వెంకటరమణ, హరిప్రసాద్, మెంటం రామారావు, వెంకటేశ్వర్లు, దొంతు సత్యనారాయణ, గొర్రె శ్రీను, దేశిగాని నర్సయ్య, సైదులు, భద్రయ్య, కోటేశ్వరరావు, ముత్తయ్య, విజయారెడ్డి, హరీశ్ పాల్గొన్నారు. కాగా, సాయంత్రం ఖిల్లాలో పర్యటించిన నామ నాగేశ్వరరావు ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలను ఓట్లు అభ్యర్థించారు.

ఎస్‌బీఐటీలో ఇఫ్తార్ విందు



ఖర్జూర తినిపిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందుకు పలువురు ముస్లింలను ఆహ్వానించి ప్రార్థనలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

తిరుమలాయపాలెం: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి, ఎదుళ్లచెరువు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎదుళ్లచెరువు, బాలాజీనగర్‌తండాల్లో మంచినీటి బావులను పరిశీలించారు. భవిష్యత్‌లో తాగునీటి ఇబ్బందులపై పంచాయతీ కార్యదర్శి మాధవితో చర్చించారు. బావుల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు వచ్చే అవకాశం లేదని గుర్తించారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పైపులు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య అన్నారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో జరిగిన ఉపాధి హామీ కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, నీడ కల్పించాలని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా చార్జీలు ఇవ్వాలని, 100 నుంచి 200 రోజుల వరకు ఒక్కో కూలీకి పని కల్పించాలని కోరారు. సమావేశంలో సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఈర్ల వెంకటఅప్పారావు, తిమ్మిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి కల్యాణానికి హాజరు కాలేని భక్తులు స్వామి వారి తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సేవల ద్వారా పొందవచ్చని ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం కార్గో సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఆవిష్కరించిన డీఎం మాట్లాడారు. కార్గో ద్వారా స్వామి వారి కల్యాణ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని ఆర్టీసీ నిర్ణయించిందన్నారు. రూ.151 చెల్లిస్తే ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ ఒకటి భక్తుల ఇంటి వద్దకు తీసుకొచ్చి అందిస్తామని, ఆర్టీసీ బస్టాండ్లలో కార్గో కేంద్రాల వద్ద ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ల కోసం బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఖమ్మం బస్ డిపో సీఐ ఆర్.రామయ్య, కార్గో రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.వీరభద్రం పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట



ట్రాక్టర్లలో ఇసుక ఎత్తుతున్న దృశ్యం

కూసుమంచి: మండలంలోని రాజుపేట సమీపంలోని పాలేరు ఏరులో కొందరు చుట్టుపక్కల గ్రామాల వారు కొంతకాలంగా జేసీబీలతో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. సోమవారం ఈ తంతంగాన్ని గ్రామస్తులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. ఏటిలో అక్రమంగా ఇసుక తవ్వటం వల్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయని, కనీసం పశువులు తాగేందుకు నీళ్లు లేక ఇబ్బందిగా మారుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, ఎస్‌ఐకి సమాచారం అందించగా ఎస్‌ఐ కిరణ్‌కుమార్ రాజుపేట చేరుకునే లోగా ఇసుక తరలించేవారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తప్పవని, వాహనాలను సీజ్ చేస్తామని, కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రాజకీయాలకు పేదలను బలిచేయొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: స్వార్థ రాజకీయాల కోసం పేదల ప్రజలను బలిచేయొవద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం అన్నారు. సోమవారం నగరంలోని రేవతిసెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సలాం మాట్లాడారు. రఘునాథపాలెం, ఖమ్మం నగర పరిధిలో భూ ఆక్రమణలు, మట్టి తోలకాలు పక్కదారి పట్టించేందుకు పేదల ఇళ్లను కూల్చివేశారని, ఈ ఘటనపై జిల్లా మంత్రులు, కలెక్టర్ స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో యానాలి సాంబశివారెడ్డి, ఎండీ రెహమాన్, జ్వాలా నర్సింహారావు, ఎస్‌కే చానా, డి.శేఖర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ



దాణా అందిస్తున్న స్తంభాద్రి సేవా సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: బహుళ అమావాస్య సందర్భంగా శ్రీస్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గొల్లగూడెంలో ఓం శ్రీకృష్ణ గోశాలకు రూ.47 వేల విలువైన దాణా అందించారు. దాల్ మిల్ యజమానులు, వ్యాపారులతో పాటు పలువురి సహకారంతో దాణాకు సంబంధించిన సామగ్రిని అందించారు. శ్రీస్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనర్సింహారావు, ప్రధాన కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావుతో పాటు సూరినేటి మల్లేశం, గజ్జి సూర్యనారాయణ, పులిపాటి సంపత్‌కుమార్, వీవీ.సుబ్బారావు, మోతుకూరి భద్రయ్య, సుంకరి ఎల్లారావు, చల్లా రమేశ్, వంగవీటి శ్రీనివాసరావు, అర్వపల్లి రామకృష్ణ, దొంగరి శివకృష్ణ, కె.విశ్వనాథం పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళి



లక్ష్మణ్‌బాపూజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: నూతనంగా అభ్యుదయ పద్మశాలి సంక్షేమ సంఘం ఏర్పడిన సందర్భంగా సోమవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్లా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం తొలిసారిగా మంత్రి పదవిని త్యజించిన మహానేత కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీరక్ష వైద్యశాల అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జెల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అనాశి రాధాకృష్ణ, కోశాధికారి గజేంద్రుల నాగేశ్వరరావు, రచ్చ రామారావు, రుద్రప్రదీప్, ముల్కా సురేశ్, రుద్ర ప్రతాప్, పిండిప్రోలు రామ్మూర్తి, ఫణితేజ, ఉదారి పద్మ పాల్గొన్నారు.

పదవి నుంచి తొలగింపు

జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుండి జెల్లా లక్ష్మీనారాయణను తొలగించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబు తెలిపారు. సమాజ ఐక్యతను విచ్ఛిన్నం చేసేలా వ్యవహరిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

సీసీరోడ్డుపై వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంనకు చెందిన వడ్డే రామయ్య.. గ్రామంలోని సీసీరోడ్డుపై వాహనాలు, ప్రజలను వెళ్లనీయడం లేదని అదే గ్రామానికి చెందిన ఎ.రవి సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రజలకు సీసీ రోడ్డుపై వెళ్లేందుకు అవకాశం కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆలయ మండపం నిర్మాణానికి గ్రానైట్ వితరణ

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండా గ్రామంలోని రామాలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అవసరమైన 500 అడుగుల గ్రానైట్ రాయిని అందించేందుకు యండపల్లి సత్యం ముందుకొచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన్ను అఫ్జల్, తారాచంద్, గ్రామస్తులు అభినందించారు.

రేపు బౌద్ధక్షేత్రం వద్ద అవగాహన

నేలకొండపల్లి: ఈ నెల 10న స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేలకొండపల్లి ఎన్నికల అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, కాలేజీలు, పాఠశాలల విద్యార్థులు, బూత్ లెవల్ అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి రానున్నట్లు తెలిసింది.

ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు

నగరంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉగాది పండుగను పురస్కరించుకొని వేడుకలను నిర్వహించారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఉగాది పండుగ ప్రాధాన్యతను తెలిపారు. ఉగాది పచ్చడి తయారు చేసి, పంపిణీ చేశారు. సర్వజ్ఞ పాఠశాలలో రంజాన్, ఉగాది వేడుకలను కలిపి నిర్వహించారు.


-ఖమ్మంసహకారనగర్




రెజొనెన్స్ పాఠశాలలో..




సర్వజ్ఞ పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలు



స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో..



త్రివేణిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం



అరవింద హైస్కూల్‌లో..

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వైద్య పరీక్షలు..

నేలకొండపల్లి: ఉపాధి హామీ కూలీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మండలంలోని మంగాపురంతండాలో సోమవారం ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. పంచాయతీ కార్యదర్శి గోపెమ్మ, సూపర్‌వైజర్ సుగుణ, ఆశ కార్యకర్తలు సుజాత, కృష్ణకుమారి, విజయ, నాగమణి పాల్గొన్నారు.

ఉగాది సామగ్రి పంపిణీ

ఖమ్మంమామిళ్లగూడెం: ఉగాది పండుగను పురస్కరించుకొని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం 26, 37వ డివిజన్లలో ఇంటింటికీ ఉగాది సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్లభనేని పుల్లయ్య, మారుతి శేష, ఫణికుమార్, జిలుగు సతీశ్‌శర్మ, ధర్మేందర్, పసుమర్తి సంతోష్, ముత్తి జనార్దన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు పూర్తి చేయండి..

ఖమ్మంమయూరిసెంటర్: గోదావరిపై దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మించి సాగునీరు అందించాలని రెండు దశాబ్దాలకు పైగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారని, సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వలు పూర్తి చేసి సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మంచికంటి హాల్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయన్నారు. మాదినేని రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి, రమేశ్, వీరభద్రం , ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి..

ఖమ్మంరూరల్: ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్‌ఓ రాజేశ్వరి తెలిపారు. సోమవారం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డులోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఖమ్మంరూరల్: మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కొండాపురం, సీతారాంపురం, తల్లంపాడుల్లో సోమవారం రాత్రి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికలు జరగడానికి పోలీసులకు సహకరించాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 800 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామని, పార్లమెంట్ ఎన్నికల సమయంలో వారందరినీ తిరిగి బైండోవర్ చేస్తామని తెలిపారు.ఎస్‌ఐ రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కవి వీరబాబుకు అవార్డు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన ప్రముఖ కవి చిలకబత్తిని వీరబాబు ఉగాది విశిష్ట సాహితీ ప్రతిభ పురష్కారం అందుకున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో భద్రాది కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలస్థాయిలో వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించగా చిలకబత్తిని వీరబాబు ప్రతిభ కనపరిచారు. సినీ గేయ రచయిత సాధనాల వెంకటనాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

రామరాజ్య స్థాపనకు కృషి

ఖమ్మంమామిళ్లగూడెం: రామరాజ్య స్థాపనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. పార్టీ దళిత మోర్చా సమ్మేళనం జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా ప్రభారి సన్నె ఉదయ్‌ప్రతాప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ తన విజయానికి సహకరించాలని కోరారు. నాయకులు మోగిలయ్య, నంబూరి రామలింగేశ్వరావు, విజయరాజు, వీరస్వామి, నున్నా రవి, సత్యనారాయణ, సునీల్, శ్యాంరాథోడ్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మంసహకారనగర్: కలెక్టరేట్‌లో ఆఫీస్ సబార్డి నేట్ కిషోర్ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు.